నమస్తే తెలంగాణ
కరీంనగర్
10 కరీంనగర్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 KARIMNAGAR

# తలనీలాలు భద్రమేనా..?

- కాంట్రాక్టర్‌తో ముగిసిన గడువు
- భద్రపరుస్తున్న రాజన్న ఆలయ అధికారులు
- కరువైన ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణ?



కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తురాలు

వేములవాడ, ఏప్రిల్ 14: వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించే తలనీలాల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ గడువు ముగియడంతో ఆలయ అధికారులే సిబ్బంది ద్వారా భద్రపరుస్తుండగా, సీసీ కెమెరాల ఏర్పాటు సరిగా లేకపోవడం, ప్రత్యేక సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండకపోవడం భద్రత లోపాలను ఎత్తిచూపుతున్నాయి. అక్కడే పర్యవేక్షించాల్సిన భద్రతా సిబ్బంది కూడా కనిపించకపోవడం అక్రమాలకు తెరలేపే అవకాశం ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు. అందులో అత్యంత విలువైన తలనీలాలను భద్రపరిచే విధానంలో లోపభూయిష్టమైన విధివిధానాలు ఉన్నాయని ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. స్వామివారికి తలనీలాల సమర్పణ, హుండీ కానుకలతో సమానం కావడం అందుకు అనుమానాలకు తావిస్తున్నది. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టికెట్లు కేటాయించినప్పుడే విలువైన తలనీలాలు భద్రపరిచే అంశంలో స్పష్టత వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మహిళలు సమర్పిస్తున్న తలనీలాలు వేలాది రూపాయల విలువ చేయడంతో భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ ఉన్నది. సిబ్బందిని మాత్రమే కేటాయించి అధికారులు చేతులు దులుపుకొన్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. రద్దీగా ఉండే సమయంలో భద్రతను పెంచి మహిళలు, పురుషులు వేర్వేరుగా టికెట్లు కేటాయించి వచ్చిన వాటిని పకడ్బందీగా భద్రపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

### ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం..

తలనీలాలకు సంబంధించి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. ఎనిమిది మంది సిబ్బందిని కేటాయించి అదనంగా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలను సెల్‌ఫోన్లకు అనుసంధానం చేసుకొని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఇకపై మహిళలకు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. తలనీలాలు దుర్వినియోగం అయినట్లయితే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

**- వినోద్‌రెడ్డి, ఈవో రాజన్న ఆలయం (వేములవాడ)**

# కేంద్రాలు నిండినయ్.. ధాన్యం కొనేదెన్నడు?



పెగడపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి, ఏప్రిల్ 14 : ఓవైపు వరి కోతలు ముమ్మరమవుతున్నాయి. మరో వైపు కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో నిండిపోయాయి. కానీ, కొనుగోళ్లు ప్రారంభించడంలో జాప్యం జరుగుతుండగా, కేంద్రాలు ధాన్యపు రాశులతో నిండిపోతున్నాయి. కేంద్రాలను ఇంతవరకు ప్రారంభించక పోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపై వడ్లు పోస్తున్నారు. పెగడపల్లి మండలంలో సుమారు 21వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



గంగాధర: మధురానగర్‌లో చౌరస్తాలో నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు



జూలపల్లి : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్



కోరుట్ల రూరల్: నమస్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# అంబేద్కర్‌కు ఘన నివాళి

- ఊరూరా మహనీయుడి జయంతి వేడుకలు
- విగ్రహాలకు పూలమాలలు వేసిన అధికారులు, నాయకులు

కరీంనగర్, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 14 : రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఊరూరా ఘనంగా జరుపుకొన్నారు. వేడుకల్లో అధికారులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడుగుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 'జై భీమ్.. జై అంబేద్కర్' అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.





మంథని: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, ఇల్లంతకుంట: నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గోదావరిఖని: ఎన్టీపీసీలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

# 'పల్లె సంత' ప్రారంభమెప్పుడో..?

- రైతుల సౌకర్యార్థం లింగంపేటలో ₹20.50 లక్షలతో ఏర్పాటు
- ఏడాది క్రితమే పూర్తయిన పనులు
- వెంటనే వినియోగంలోకి తేవాలని స్థానికుల డిమాండ్




లింగంపేటలో నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న పల్లె సంత

చందుర్తి, ఏప్రిల్ 14: చిన్న సన్నకారు రైతుల సౌకర్యార్థం నాబార్డ్ సేవ్స్, గ్రామ పంచాయతీ సహకారంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో పల్లె సంత (గ్రామీణ మార్కెట్) ఏర్పాటు చేసింది. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ కల్పించడంతోపాటు దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు గానూ 2022లో దాదాపు పది గుంటల్లో కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి పక్కన గ్రామ శివారులో పనులు ప్రారంభించింది. నాబార్డ్ సేవ్స్ నిధులు ₹15లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు ₹2.50లక్షలు, మాజీ సర్పంచ్ దప్పుల లక్ష్మి సొంత ఖర్చులు ₹3లక్షలతో పల్లె సంతనిర్మాణ పనులు ఏడాదిలోనే పూర్తి చేసింది. అయితే ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో దీనిపై నిర్లక్ష్య కొనసాగింది. అప్పటి నుంచి నేటి వరకు గ్రామీణ మార్కెట్ వినియోగంలోకి రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మార్కెట్‌ను ఇలా వదిలేయడం ఏంటని మండిపడుతున్నారు. మార్కెట్ ప్రారంభమైతే కూరగాయలు, ఆరుతడి పంటలు పండించే చిన్న, సన్న కారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేసున్నారు.



### వినియోగంలోకి తేవాలి

మార్కెట్ ప్రారంభమైతే కూరగాయలు, ఆరుతడి పంటలు పండించే చిన్న, సన్న కారు రైతులకు ఎంతో ఉపయోగపడుతది. దళారీ వ్యవస్థ బాధ కూడా ఉండదు. రైతులకు దూరభారం, రవాణాభారం తగ్గుతుంది. అధికారులు వెంటనే వినియోగంలోకి తేవాలి.

**- ఆకుల ఎల్లయ్య, రైతు (లింగంపేట)**



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సిబ్బంది

# అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 14 : అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నివారణ గురించి అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ రూపొందించిన ప్రత్యేక ప్రచార పోస్టర్‌ను ఆయన స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫైర్ సేఫ్టీపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం అని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య వంతులను చేయడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ పోస్టర్‌లో అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో ప్రజలు అనుసరించాల్సిన చర్యలు, ఫైర్‌సర్వీస్ అంబులెన్స్, సిబ్బంది సమాచారం చక్కగా చూపించినట్లు చెప్పారు. ప్రజలు ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే 101కి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఓ కృష్ణకాంత్, ఎల్‌ఎఫ్ రవీందర్, జీ మధు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# కళ తప్పిన పల్లె

నిర్వహణ కరువైన పెగడపల్లి మండల కేంద్రంలోని డంప్‌యార్డు



- ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలోనే బావురుమంటున్న గ్రామాలు
- ఆనవాళ్లు కోల్పోతున్న ప్రకృతి వనాలు
- మట్టికొట్టుకుపోయిన మంకీఫుడ్ కోర్టులు
- పచ్చదనం, పరిశుభ్రతపై నిర్లక్ష్యం
- పట్టని రాష్ట్ర ప్రభుత్వం
- పల్లెవాసుల్లో ఆగ్రహం



మల్యాల మండలం రాజారం గ్రామంలో రోడ్డు పక్కనే చెత్త

ఏడాదిన్నర కిందటి వరకు సకల వసతులతో కళకళలాడిన పల్లె ఇప్పుడు కన్నీరు పెడుతున్నది. పచ్చని పొలాలు.. చిక్కని బంధాలు.. ఎటు చూసినా ఆహ్లాదకర వాతావరణం, ఇంటిముందు, ఇంటి వెనుక, పెరట్లో పరుచుకున్న పచ్చదనంతో మొన్నటి వరకు విలసిల్లినా.. నేడు రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో ఆనవాళ్లను కోల్పోయే దుస్థితికి చేరుకుంటున్నది. ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాలు, మంకీఫుడ్ కోర్టులు ఎండిపోయాయి. డంప్ యార్డులు నిర్వహణ కరువయ్యాయి. వీధులు చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయి. ఇలా ఏడాదిన్నరలోనే పల్లె రూపురేఖలు మారిపోగా.. పల్లెవాసుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.


జగిత్యాల, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 14 : స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో 2019 సెప్టెంబర్ 6న ప్రారంభమైన పల్లె ప్రగతి కార్యక్రమంతో పల్లెలు సరికొత్తగా ముస్తాబయ్యాయి. జగిత్యాల జిల్లాలోని 18 మండలాల పరిధిలో 380 గ్రామ పంచాయతీలుండగా, వీటన్నింటికీ ప్రతి నెలా రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నుంచి నేరుగా నిధులు మంజూరవుతూ వచ్చాయి. గ్రామ జనాభా ప్రకారం ఒక వ్యక్తికి ఏడాదికి ₹1631 చొప్పున, సగటున జిల్లాకు నెలకు వచ్చే ₹6.90 కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. ఈ నిధులతో మొత్తం గ్రామాల్లోని 1,461 కిలోమీటర్ల అంతర్గత రోడ్లు, 907 కిలోమీటర్ల మురుగు కాలువలు క్రమం తప్పకుండా శుభ్రమయ్యాయి. అందుకోసం 500 జనాభాకు ఒక పారిశుధ్య కార్మికుడిని నియమించారు. వారికి గతంలో తక్కువ వేతనం ఉండగా, స్వరాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ నెలకు ₹8500 వేతనం కచ్చితంగా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే నిధుల నుంచే వేతనాలు చెల్లించారు. చెత్తను తొలగించి, డంప్‌యార్డుకు తీసుకువెళ్లేందుకు ట్రాక్టర్, ట్రాలీని, అలాగే వాటర్ ట్యాంకర్‌ను ప్రతి గ్రామం సమకూర్చుకున్నది. అలాగే, గ్రామంలో ఆదాయ వనరులను బట్టి చెత్తను తొలగించేందుకు ట్రైసైకిల్స్‌ను వినియోగించారు. అలాగే, ప్రతి గ్రామానికి వచ్చే నిధుల్లో పదిశాతం (₹9.7 కోట్లు) గ్రీన్ బడ్జెట్‌గా ప్రకటించారు. వీటిద్వారా ప్రతి గ్రామంలో నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్లను ఏర్పాటు చేసి, నాటిన మొక్కలకు రక్షణ, నీటి సరఫరా వంటివి కల్పించారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 40 గ్రామాల్లో మొక్కల పెంపకానికి నర్సరీలు ఉండగా, పల్లె ప్రగతి ప్రారంభమైన తర్వాత 380 గ్రామాల్లో ఏర్పాటయ్యాయి. జిల్లాలో 1683 కిలోమీటర్ల పొడవునా 2,19,089 గుంతులు తీసి మొక్కల పెంపకం చేపట్టారు. జిల్లాలోని అన్ని గ్రామాలతో పాటు హామ్లెట్ గ్రామాల్లో మొత్తం 420 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటవగా, అందులో 7.70 లక్షల మొక్కలను పెంచారు. దీంతో అవి మొన్నటి వరకు ఉద్యానవనాలుగా మారిపోయాయి. ₹1.83 కోట్ల అంచనాలతో వీటిని పూర్తి చేశారు. ప్రభుత్వం నెల నెలా ఇచ్చే నిధులతో పాటు, ఉపాధి హామీ పథకాన్ని వనాల నిర్మాణానికి అనుసంధానం చేశారు. శ్మశానవాటికలు లేని గ్రామాలను గుర్తించి, వైకుంఠధామాలను నిర్మించారు. జిల్లాలో 377 గ్రామాల్లో వైకుంఠధామాలు పూర్తి చేశారు. తడి, పొడి చెత్తను వేరు సేకరించేందుకు జిల్లాలో ప్రతి ఇంటికీ బుట్టలను పంపిణీ చేశారు. ప్రతి పల్లెలో ఒక డంప్ యార్డు ఏర్పాటు చేశారు. చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసేందుకు 379 గ్రామాల్లో కంపోస్ట్ షెడ్లను ₹7.77 కోట్ల అంచనాలతో నిర్మించారు. చాలా గామాల్లోని సెగ్రేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేస్తూ వచ్చారు. ఎరువులను గ్రామంలోని నర్సరీల్లో పెంచే మొక్కలకు వినియోగించారు. పల్లె ప్రగతిలో భాగంగా పాడుబడ్డ బావులను పూడ్చివేశారు. ముళ్లపొదలు, నీటి గుంతలు, శిథిలమైన భవనాలు, గుడిసెలు పూర్తిగా తొలగించారు. అలాగే, విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. జిల్లాలో 2612 చోట్ల లూజ్‌వైర్లను తొలగించారు. పాడయిన 4276 విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్తవి వేశారు. వంగిపోయిన వెయ్యి విద్యుత్ స్తంభాలను మార్చారు. తుప్పుపట్టిన 246 స్తంభాలను తొలగించి కొత్తవి అమర్చారు. వీటితో పాటు 2500 కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. 9356 ఎల్‌ఈడీ విద్యుత్ బల్బులను అమర్చారు. 5299 గృహాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించారు. తొలి సీఎం కేసీఆర్ ప్రారంభించిన ఈ కార్యక్రమం అనేక మార్పులకు నాంది పలికింది.

### పదహారు నెలల్లో అస్తవ్యస్తం

కాంగ్రెస్ సర్కారు వచ్చిన పదహారు నెలల కాలంలోనే పల్లె సొబగులు పటాపంచలయ్యాయి. పల్లెల్లో దారుణమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు గామాలను పరిశీలిస్తే పల్లె పాలన ఆగమైందన్న విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. నర్సరీల్లో మొక్కలు ఎండిపోయి చచ్చిపోతున్నాయి. సరిగా నిధులు రాకపోవడంతో ట్యాంకర్లు, ట్రాక్టర్లు, ట్రాలీలకు నెల వారీ కిస్తీలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. గ్రామ శివారులో స్వాగత తోరణాలుగా పెరిగిన చెట్లకు నీరు పట్టే పరిస్థితి లేక అవి ఉనికిని కోల్పోయాయి. ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు సైతం డబ్బులు లేక ప్రతి రోజూ చెట్లకు నీళ్లు పట్టే పరిస్థితి లేకుండా పోయింది. మురికి కాలువలు నిండిపోయి, ఎక్కడి వ్యర్థాలు అక్కడే దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్త సేకరణ అటకెక్కింది. వీధి దీపాలతోపాటు, ఇతర విద్యుత్ సరఫరాకు సంబంధించిన బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. చాలా గ్రామాలు రూ.లక్షల కొద్దీ విద్యుత్ బిల్లులు బకాయిపడ్డాయి. ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు నిర్వహణ లేక చాలా చోట్ల తమ ఉనికిని కోల్పోతున్నాయి. ఏడెనిమిది నెలల క్రితం వరకు ఉద్యానవనాలుగా దర్శనమిచ్చిన ప్రకృతి వనాలు నేడు పాడుబడిన కేంద్రాలుగా కనిపిస్తున్నాయి. ఇక చాలా గ్రామాల్లో హరితహారాల్లో భాగంగా నాటిన మొక్కలను కొట్టివేతకు గురవుతున్నాయి. జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట శివారులో భారీగా పెరిగిన హరితహారం చెట్లను విద్యుత్ తీగలకు అడ్డం వస్తున్నాయన్న మిషతో కొట్టివేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మొత్తానికి పాలకుల పట్టింపులేనితనం, నిధుల విడుదలలో జాప్యంతో తిరిగి పల్లెలు తమ ప్రభను కోల్పోతున్నాయి.



కోరుట్ల మండలం సంగెంలో ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం



కల్లెడ వద్ద ఆనవాళ్లు కోల్పోయిన మంకీఫుడ్ కోర్టు

### మంటగలిసిన మంకీఫుడ్ కోర్టులు

కోతులు అటవీ ప్రాంతాలకు వాపస్ పోవాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో 20కి పైగా మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేశారు. వంద ఎకరాల అటవీ స్థలాల్లో జామ, నారింజ, సపోట, అల్లనేరుడు, అరటి, తునికి, ఉసిరి, చింత ఇలా అనేక పండ్ల మొక్కలను వీటిలో నాటి పెంచే ప్రక్రియ మొదలు పెట్టారు. ఐదారేండ్లలో ఎదిగి పండ్లను ఇస్తాయని అందరూ భావించారు. అందు కోసం అప్పటి అధికారులు శ్రమించారు. మల్యాల, సారంగాపూర్, కల్లెడ, మెట్‌పల్లి, కొడిమ్యాల ప్రాంతాల్లో మంకీఫుడ్ కోర్టులు మంచిగా పెరిగాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వ పట్టింపులేనితనంతో మంకీఫుడ్ కోర్టులన్నీ ఎండిపోయాయి. కల్లెడ శివారులోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మంకీఫుడ్ కోర్టు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. చెట్లన్ని ఎండిపోయి నేలకూలిపోయాయి. ఎంతో ఆశగా అటవీ ప్రాంతాన్ని పండ్లమయం చేయాలన్న ఆలోచన నీరుగారిపోయింది. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పాలన పడకేసి, తిరిగి ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన రోజులు మళ్లీ ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తుండడంతో ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతున్నది.